


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఖమ్మం

5

బుధవారం 15 అక్టోబరు 2025

24గంటల్లో విధుల్లో చేరకుంటే

క్రమశిక్షణ చర్యలు

- ఉత్తర్వులు జారీ చేసిన భద్రాద్రి దేవస్థానం ఈవో

భద్రాచలం అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానంలో పరిపాలన సౌలభ్యం కోసం ఈనెల 13న చేసిన అంతర్గత బదిలీల్లో భాగంగా 24 గం టల్లో సంబంధిత ఉద్యోగులు వారికి కేటాయించిన విభాగంలో జాయిన్ అయ్యి.. జాయినింగ్ రిపోర్టు సమర్పించాలని దేవస్థాన ం ఈవో కే దామోదర్ రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం ఉద్యోగుల విధుల్లో మార్పులు చేసినా ఉద్యోగులు నూతన విభాగాల్లో జాయినింగ్ రిపోర్టు సమర్పించకపోవడంతో ఈ హెచ్చరిక ఉత్తర్వులను జారీ చేసిన ట్లు తెలుస్తోంది. ఉత్తర్వులు అందిన 24 గంటల్లో నూతన విభాగాల్లో చార్జీ పొంది సంబంధిత (మిగతా 6వ పేజీలో)



జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్

- భద్రాద్రిలో సంప్రదాయ బద్ధంగా గిరి ప్రదక్షిణ 6



ప్రభుత్వ స్థలాల్లో..

పామాయిల్

ఖాళీ జాగాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటడంపై ఉద్యానశాఖ దృష్టి

- పచ్చదనంతో పాటు ఆదాయం సమకూరేలా ఆలోచన
- మంత్రి తుమ్మల సూచనలతో కార్యాచరణ రూపొందిస్తున్న అధికారులు
- విధివిధానాల కోసం ఎదురుచూపు

ఖమ్మం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా.. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఏటా హరితహారం, వనమహోత్సవం ఇలా పలు పేర్లతో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రూ.కోట్లు ఖర్చుచేసి ప్రభుత్వ స్థలాలు, రహదారుల వెంట పెద్దఎత్తున మొక్కలు నాటడం ఒకతంతుగా సాగుతూ వస్తుంది. గతంలో ఖాళీ స్థలాల్లో, పొలాల గెట్ల వెంట తాటి, ఈతచెట్లు ఉండేవి. ఇవి కనుమరుగవుతున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈసారి వినూత్నంగా ఆలోచించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆలోచనతో ప్రభుత్వ స్థలాలు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, బీడుభూముల్లో పెద్దఎత్తున ఆయిల్‌పామ్ మొక్కలుపెంచి అటు పచ్చదనంతో పాటు ఇటు ఆదాయం పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాను మోడల్‌గా ఎంపిక చేసి.. నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, విద్యా, రెవెన్యూ, దేవాదాయ, అటవీ తదితర శాఖలకు సంబంధించిన ఖాళీ భూములను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో పాలేరు నుంచి కల్లూరు వరకు ఎన్నెస్పీకి.. ప్రధాన కాలువ వెంట ఇరువైపులా ఖాళీస్థలాలున్నాయి. దీనికితోడు గతంలో ఎన్నెస్పీ క్వార్టర్స్ నిర్మాణం తదితర అవసరాల నిమిత్తం ఉంచిన భూములు చాలావరకు ఖాళీగానే ఉన్నాయి. వీటిలో ఇప్పటికే చాలావరకు అన్యాక్రాంతమవుతున్నాయి. సీతారామ ప్రాజెక్టు ద్వారా అశ్వాపురం నుంచి పాలేరు వరకు ప్రాజెక్టు కాలువ 130కి.మీ.పైగా నిర్మాణం జరిగింది.

ఇటు ఎన్నెస్పీ, సీతారామ ప్రధాన కాలువలతో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ కూడా ఉన్నాయి. అలాగే ఇరిగేషన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలో పలు ప్రాజెక్టులు, చెరువులు కూడా ఉన్నాయి. ఇలా ఇరిగేషన్ చెరువు కట్టలు, ప్రాజెక్టుల పక్కన ఖాళీ భూముల్లోనూ ఆయిల్‌పామ్ మొక్కలు వేసేందుకు కసరత్తు జరుగుతోంది. అలాగే జిల్లాలో సూర్యాపేట-ఖమ్మం, ఖమ్మం-దేవరపల్లి (మిగతా 6వ పేజీలో)

ఇంకా విధి విధానాలు రాలేదు

ఎంపీ మధుసూదన్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి

ప్రభుత్వం ఖాళీ స్థలాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు సాగు చేయించేందుకు ఆయాశాఖల స్థలాలు గుర్తించాలని నిర్ణయించింది. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఖాళీ స్థలాల ఎంపిక, ఆయిల్ పామ్ మొక్కలు వేయించడం, వాటి పర్యవేక్షణ, డ్రిప్, సోలార్ విద్యుత్ మోటార్ల ఏర్పాటు లాంటి అంశాలపై ఇంకా విధి విధానాలు రాలేదు. అవి రాగానే కార్యాచరణ చేపడతాం. ప్రభుత్వ ఆలోచన ప్రకారంగా ప్రభుత్వ శాఖల ఖాళీభూముల్లో ఆయిల్‌పామ్‌మొక్కలు వేయడం ద్వారా పచ్చదనంతోపాటు ప్రతీ మొక్క ద్వారా ఏటా ఆదాయంతో పాటు అనేకమందికి ఉపాధి కూడా చూపిస్తుంది.

తెలంగాణ జరూర్ ఆనా..



రిపోర్టు చేస్తున్న టూరిజం పోలీసులు

పర్యాటకులకు అండగా

టూరిస్ట్ పోలీస్

- భద్రాద్రి జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకున్న పది మంది
- నేటినుంచి విధుల్లోకి సిబ్బంది
- రక్షణ, భద్రత కల్పించడంతో పాటు భరోసాగా ఉండనున్న ఖాకీలు
- జిల్లా ఇన్‌చార్జ్‌కు రిపోర్టు చేసిన శిక్షణ పోలీసులు

భద్రాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాబోయే కాలంలో పర్యాటక రంగమే రాష్ట్రంలో ప్రధాన ఆదాయ వనరుగా రూపుదిద్దుకుంటోంది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు చేపట్టి అందుకు అనుగుణంగా దేశ, విదేశాల నుంచి తరలివచ్చే పర్యాటక అతిథులకు తెలంగాణ జరూర్ ఆనా (తెలంగాణకు తప్పక రండి) అనే నినాదంతో ముందుకు వెళ్తోంది. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటక అతిథులకు రక్షణ,

మిగతా 6లో..

రేపు ఖమ్మంలో జాబ్‌మేళా : ఉపాధి కల్పనాధికారి

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఖమ్మం రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఉద్యోగాలను కల్పించేందుకు గురువారం గాంధీచౌక్‌లోని రిలయన్స్ నిప్పాన్ లైన్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. సేల్స్‌మేనేజర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హత ఉన్న వారు అర్హులన్నారు. జీతం రూ.25 నుంచి 40వేల వరకు ఉంటుందన్నారు. 10 పోస్టుల భర్తీకి జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సకల సౌకర్యాలతో..

రూరల్ మండల కార్యాలయాల నిర్మాణం 7

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు



భవనాల నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్



అధికారులతో సమావేశమైన అదనపు కలెక్టర్ శ్రీజ

క్లీనికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టును

కట్టుదిట్టంగా అమలు చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ
- చట్టం అమలుపై సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): క్లీనికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కట్టుదిట్టంగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, క్లీనికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ కింద జిల్లాలో అనుమతులు, రెన్యువల్స్ కోసం వచ్చిన దరఖాస్తుల్లో ఆమోదించినవి, తిరస్కరించిన, పెండింగ్‌లో ఉన్న వాటిపై వైద్యాధికారులతో సమీక్షించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని అన్నారు. ఆసుపత్రులను సీజ్ చేసిన తర్వాత కోర్టుల్లో పెండింగ్ ఉన్న కేసుల్లో సరైన ఆధారాలతో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు తెలిపారు. కౌంటర్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించి, సీపీ, లా అండ్ ఆర్డర్ డీసీపీ అభిప్రాయం తీసుకుని పక్కాగా ఉండేలా దాఖలు చేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాల కొనుగోలు నిబంధనల ప్రకారం జరగాలని, పరికరాలను నేరుగా నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలని, పెద్ద యంత్రాలు కొనుగోలుకు ఈ ప్రొక్యూర్ మెంట్ చేయాలన్నారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ ప్రసాదరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి బాయి, డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ చందునాయక్, ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ రెహానా బేగం, ప్రోగ్రాం అధికారులు వెంకట రమణ, రామారావు, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

22న స్థంభాద్రి నృసింహుడి గిరిప్రదక్షిణ

- ముందస్తు ప్రకటన విడుదల చేసిన ఈవో
- గతంలో సమాచారం లేక తగ్గిన భక్తుల సంఖ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్వయంభు దివ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ఖమ్మంలోని స్థంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి (గుట్ట) గిరి ప్రదక్షిణను ఈనెల 22న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో, దేవాదాయ శాఖ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే ప్రతీ నెల స్వామి వారి జన్మ నక్షత్రం రోజున నరసింహస్వామి వారి గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. కానీ గత రెండు, మూడు నెలలుగా కనీస సమాచారం ఇవ్వకపోతుండటంతో భక్తుల రాక తగ్గింది. ముఖ్యంగా గతనెల 25న జరిగిన వేడుకకు భక్తులు రాకపోవడంపట్ల సర్వత్రా అసంతృప్తి వ్యక్తమైంది. ఈవో, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నెల నెల గిరి ప్రదక్షణకు భక్తుల సంఖ్య తగ్గుతోందంటూ 26వతేదీన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. ఈనెల 22న జరగబోయే గిరి ప్రదక్షణకు సంబంధించి వారం ముందుగానే భక్తులకు సమాచారం అందిస్తూ ఆలయ ఈవో జగన్‌మోహన్‌రావు వీడియో ప్రకటన విడుదల చేశారు. అయితే సోషల్‌మీడియాలో చేస్తున్న ఈ ప్రచారానికి తోడు నగరంలోని వివిధ ఆలయాలు, నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ప్రచార పోస్టర్లు పెట్టగలిగితే భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. ఇక అయ్యప్ప మాలధారణ తీసుకుంటున్న భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ సారి గిరి ప్రదక్షణలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరగనున్నట్టు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో అయ్యప్ప స్వాములకు భిక్ష నిర్వహిస్తున్న కేంద్రాలు, ఆలయాలతో పాటు శ్రీనివాసనగర్, బైపాస్‌రోడ్ అయ్యప్ప ఆలయాల వద్ద సమాచారం అందించాలని పలువురు కోరుతున్నారు.

జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్

- భద్రాద్రిలో సంప్రదాయబద్ధంగా గిరి ప్రదక్షిణ
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



భద్రగిరి ప్రదక్షిణ అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులు

భద్రాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరామచంద్రుని జన్మనక్షత్రం.. పునర్వసును పురస్కరించుకొని కొత్తగూడెం భక్తరామదాసు ట్రస్టు ఆధ్వర్యంలో భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం సహకారంతో మంగళవారం భద్రగిరి ప్రదిక్షణను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తరామదాసు వారసులు, భక్తరామదాసు ట్రస్టు నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు సీతారామచంద్రలక్ష్మణస్వామి చిత్రపటాన్ని చేత పట్టుకోగా.. దేవస్థానం అదర్వ వేద పండితులు గుడిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ఏఈవో శ్రావణ్ కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, విశ్రాంత వేద పండితులు చిట్టి హనుమత్‌శాస్త్రి తదితరులు ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్' అన్న భక్తుల రామనామస్మరణతో భద్రగిరి మారుమోగింది. రామాలయానికి చేరుకున్న అనంతరం దేవస్థానం అదర్వ వేద పండితులు గుడిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ భద్రగిరి ప్రదిక్షణ నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమని తెలిపారు. ఇదిలా ఉండగా కొద్ది కాలంగా పునర్వసు నక్షత్రం రోజున రామ భక్తులు భద్రగిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు.

తొలి మంచు కురిసె..



శీతాకాలం సమీపిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పొగ మంచు కమ్మేసింది. ముఖ్యంగా నగరంలో రోడ్లపై మంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. అయతే ఈ సీజన్‌లోనే 'తొలి'సారి మంచుకురవడంతో పర్యావరణ ప్రేమికులు ఫొటోలను ఫోన్‌లలో బంధించారు.

● ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



రైల్వేలైన్‌తో గిరిజన గ్రామం కనుమరుగు

- ఉన్న ఒక్క ఇంటికి రహదారి, తాగునీరు, విద్యుత్ బంద్
- పగలు ఇంట్లో... రాత్రుళ్లు పక్క గ్రామంలో రాందాస్ కుటుంబం
- జర్పులా తండా, చిమ్నాతండా వాసులకు తప్పని తిప్పలు

చంద్రుగొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రైల్వేలైన్ నిర్మాణం కారణంగా చిమ్నా తండా అనే గిరిజన గ్రామం కనుమరుగైంది. ఫలితంగా ఆగ్రామంలో బాదావత్ రాందాస్ కుటుంబం మాత్రమే మిగిలింది. ఆ ఇంటికి రహదారి, తాగునీరు, విద్యుత్ బంద్ అయ్యాయి. అంతే కాకుండా పక్కనే ఉన్న మరో గిరిజన గ్రామం జర్పులా తండా వాసులను కూడా సమస్యలు వెంటాడుతున్నాయి. రైల్వే శాఖ ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించి చేతులు దులుపుకోగా, గ్రామంలో మౌలిక వసతులను పునరుద్ధరణ పనులు చేపట్టకుండా వివిధ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తిట్లు వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా చిమ్నా తండాలో వేర్వేరు కారణాలతో పలువురు గ్రామాన్ని వదిలి వేరే గ్రామాలకు వెళ్లిపోయారు. రెండు గ్రామాలకు తాగునీరు అందించే హెడ్ వాటర్‌ట్యాంకు పరిహారంలో భాగంగా రైల్వే అధికారులు రూ.20లక్షల కుపైగా ఆర్‌డబ్ల్యూ శాఖకు పరిహారం అందించారు. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం ఆ నిధులతో జర్పులా తండాలో చిన్నపాటి ప్లాస్టిక్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఆ ట్యాంకుతో గ్రామానికి సరిపడా నీరు అందడంలేదని గ్రామస్థులు తెలిపారు. ఒక పక్క సౌకర్యాలు లేమితో మరో పక్క గూడ్స్ ధ్వనితో గ్రామంలో ఉండలేక పోతున్నామని గ్రామస్థులు పలువురు ఆవేదన చెందుతున్నారు.

అమలు కాని తహసీల్దార్ హామీ

రైల్వేలైన్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన వారికి చెల్లించినట్లు తనకు పరిహారం చెల్లించాలని రాందాస్ రైల్వే అధికారులను కోరాడు. తమ ప్లాన్‌లో నీ ఇల్లు లేదని పరిహారం ఇవ్వటం కుదరదని రైల్వేఅధికారులు తెలిపారు. దాంతో రాందాస్ కుటుంబం గ్రామస్థులతో కలిసి పనులు అడ్డుకున్నాడు. దాంతో తహసీల్దార్ సంధ్యారాణి గ్రామానికి చేరుకొని రైల్వేఅధికారులతో చర్చించారు. అందరికి ఇచ్చినట్లే పరిహారం ఇప్పిస్తానని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించాడు. ఆరు నెలలు దాటినా పరిహారం రాలేదని బాధిత కుటుంబ సభ్యులు రాందాస్, చిన్నా తెలిపారు. పగలు సౌకర్యాలు లేని ఇంట్లో ఉంటూ రాత్రుళ్ల పక్క గ్రామం జర్పులా తండాలోని బంధువుల తలదాచుకుంటున్నట్లు బాధితుడు రాందాస్ తెలిపాడు.



జర్పులాతండాలో అధికారులు ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వాటర్ ట్యాంక్



చిమ్నాతండా గ్రామంలో మిగిలిన రాందాస్ ఇల్లు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

కొణిజర్ల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్-14 కబడ్డీపోటీలలో తనికెళ్లసమీంలో గల వైరా ఎంజేపీ జ్యోతిరావుపులే గురుకుల పాఠశాల విద్యార్థులు అన్ని స్థాయిల్లో ప్రతిభ చూపారు. అండర్- 14 కబడ్డీ విభాగంలో ఏ.మనోజ్, పి.బాబు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈవిద్యార్థులను ప్రిన్సిపాల్ బొడ్డు నాగమణి, ఏటీపీ రంజిత్‌కుమార్, పీఈటీ భాస్కర్ తదితరులు అభినందించారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి



సదస్సును ప్రారంభిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వైరా, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను ఎక్కువగా వినయోగించాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంతకుమార్ సూచించారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరితాదేవి, మధిర ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణిదేవి, డాక్టర్ హేమంతకుమార్ మాట్లాడారు. వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు కృష్ణతేజ, శిరీష, ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు చైతన్య, డాక్టర్ టి.పావని, పణిశ్రీ, తదితరులున్నారు.

'బెస్ట్ అవైలబుల్' పాఠశాలల విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు: డిప్యూటీ సీఎం

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో చదివే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల విద్యార్థుల సంక్షేమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలలో చదివే షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్ తెగలకు చెందిన విద్యార్థుల సంక్షేమంపై ఆయా జిల్లాల కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, ఆరోగ్యం మెనూ ప్రకారం భోజనం, ఇతర మౌలిక వసతుల అమలుపై పాఠశాలలను సందర్శించి పరిశీలించాలని తెలిపారు. విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యాబోధన కొనసాగించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంక్షేమంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు శ్రీలత, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు, సంబంధిత అధికారులు తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇసుక కూపన్ల జారీలో అధికారుల హైడ్రామా..?

61 కూపన్లకు 5 కూపన్లలో లోపాలు

ఎనిమిది ట్రాక్టర్లను ర్యాంప్‌లో డంప్ చేయించిన పోలీసులు

ఆళ్లపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : ఆళ్లపల్లి మండలంలో ఇందిరమ్మ ఇంటికి కూపన్లు జారీ చేయడంలో మంగళవారం అధికారులు హైడ్రామా చేశారు. దొరికితె దొంగ లేదంటే దొరా.. అన్నట్టుగా, రాయిపాడు కిన్నెరసాని వాగు నుంచి ఇల్లెందు నియోజకవర్గానికి ఇసుక తీసుకేళ్లేందుకు మంగళవారం రెవెన్యూ కార్యాలయం నుంచి 61 కూపన్లు అధికారులు జారీ చేశారు. ఈ క్రమంలో రాయిపాడు కార్యదర్శి అందులో 56ట్రాక్టర్లకు కూపన్లు జారీ చేయగా 5 కూపన్లకు సరైన ఆధారాలు, పొంతన లేకుండా ట్రాక్టర్ల నంబర్లు నమోదు చేయడంతో రద్దు చేశారు. కాగా 8 ట్రాక్టర్లకు అదనంగా ఏ ఆధారం లేకుండానే రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఇసుకను లోడ్ చేయించి ఇల్లెందుకు తరలించేందుకు సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న పోలీస్, అటవీశాఖ సిబ్బంది రాయిపాడు ఇసుక ర్యాంప్ దగ్గరకు చేరుకుని పొంతన లేని 5 కూపన్లను రద్దు చేసి, ఎటువంటి ఆధారాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించేందుకు సిద్ధం చేసిన 8 ట్రాక్టర్ల ఇసుకను ర్యాంప్‌లో డంప్ చేయించారు.

రూ.2.96 కోట్లతో కళాశాలలకు మరమ్మతులు

కారేపల్లి అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 15 జూనియర్ కళాశాలల్లో రూ.2.96 కోట్లతో మరమ్మతు పనులను చేపడుతున్నట్లు ఖమ్మం ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కె.రవికుమార్ తెలిపారు. మంగళవారం కారేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాజరు శాతం పెరిగిందన్నారు. అదేవిధంగా హెచ్ఆర్ఎంఎస్ సీసీ కెమెరాలను అమర్చడం ద్వారా కళాశాల సిబ్బంది విధి నిర్వహణ పనితీరును, ఇంటర్మీడియట్ కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. అనంతరం కళాశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులకు అండగా.. టూరిస్ట్‌పోలీస్



(5వ పేజీ తరువాయి)

ఇవ్వడంతో పాటు మార్గదర్శిగా నిలిచేందుకు టూరిస్టు పోలీసు అనే ప్రత్యేక పోలీసింగ్ విధానంను ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో ని వివిధ జిల్లాల నుంచి డిగ్రీ, పీజీ ఇతర ఉన్నత చదువులు చదివి తెలుగుతో పాటు ఆంగ్లం, హిందీలో నిష్ణాతులైన వారిని గుర్తించి 80 మందికి హైదరాబాద్‌లోని నిథమ్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంటు)లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పది మంది టూరిస్టు కానిస్టేబుళ్లు కలెక్టరేట్‌లో జిల్లా యువజన క్రీడల అధికారి పరందామరెడ్డికి రిపోర్టు చేశారు. బుధవారం నుంచి ఈ సిబ్బంది విధుల్లో నిమగ్నం కానున్నారు.

టూరిస్టు పోలీసుల ఎంపిక ఇలా

జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో డిగ్రీ, పీజీ, బీటెక్ చదివి తెలుగుతో పాటు హిందీ, ఆంగ్లంలో నిష్ణాతులైన వారిని గుర్తించి శిక్షణకు పంపారు. భద్రాచలం పట్టణ పోలీసు స్టేషన్, ట్రాఫిక్, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, లక్ష్మీదేవిపల్లి, ఆళ్లపల్లి, టేకులపల్లి తదితర పోలీసు స్టేషన్‌ల నుంచి పది మందిని హైదరాబాద్‌లోని నిథమ్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 80 మంది కానిస్టేబుళ్లకు టూరిస్టు పోలీసుల ప్రత్యేక శిక్షణ ఈ నెల 6 నుంచి 9 వరకు ఇచ్చారు. 10, 11 తేదీల్లో క్షేత్ర స్థాయిలో యాదగిరిగుట్ట, గోల్కొండ కోట, లుంబిని పార్కు, బోనగిరి, కుతుబ్‌షాహి సమాధులకు వద్దకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు.

పర్యాటకులకు రక్షణ, భద్రత భరోసాగా..

టూరిస్టు పోలీసులు బుధవారం నుంచి విధుల్లో చేరనున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం, మరో పుణ్యక్షేత్రం పర్ణశాల, జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధిపొందిన కిన్నెరసానిల్లో టూరిస్టు పోలీసులు విధులు నిర్వహిస్తారు. భద్రాచలంలో ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక మహిళ కానిస్టేబుల్, పర్ణశాలలో ముగ్గురు కానిస్టేబుళ్లు, కిన్నెరసానిలో ఇరువురు కానిస్టేబుళ్లు, ఒక మహిళ కానిస్టేబుళ్లు విధులు నిర్వహించనున్నారు. వీరు దేశ విదేశాల నుంచి తరలి వచ్చే పర్యాటకులకు రక్షణ, భద్రత ఇవ్వడంతో పాటు వారు వెళ్లే పుణ్యక్షేత్రాలు, దర్శనీయ స్థలాలకు మార్గదర్శిగా నిలవనున్నారు. ఇదే సమయంలో పర్యాటక అతిధులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వారు వ్యవహరించనున్నారు. ఈ క్రమంలో తెలుగుతో పాటు హిందీ, ఆంగ్లభాషల్లో వారికి పరిస్థితిని వివరిస్తారు. ఇదిలా ఉండగా పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో చేయదగినవి, చేయకూడనివి ఏమిటి అనే వివరాలు సైతం వాటిపై అవగాహన కల్పించనున్నారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయనున్నారు. కాగా వీరికి డ్రస్‌కోడ్ సైతం త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది.

యూనియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్‌గా ఆదివాసీ యువతి



సోడే లావణ్య

భద్రాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని రాజుపేట కాలనీకి చెందిన ఆదివాసీ యువతి సోడే లావణ్య యూనియన్ బ్యాం కు అసిస్టెంటు మేనేజరు(క్రెడిట్) జేఎంజీఎస్-1 గ్రేడ్‌కు ఎస్టీ కేటగిరీలో ఎంపికైనట్లు అధికారిక సమాచారం వచ్చింది. 2025-26లో యూనియన్ బ్యాంకు రిక్రూట్‌మెంటు ప్రాజెక్టు స్పెషలిస్టు ఆఫీసర్ ఇతర పోస్టులకు నిర్వహించిన పరీక్షల్లో లావణ్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అసిస్టెం టు మేనేజరుగా ఎంపికైంది. తన సోదరుడు సోడే హరీష్ కర్ణాటక రాష్ట్రంలో సెంట్రల్ బ్యాంకులో పీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా లావణ్య తండ్రి విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహించి మృతిచెందగా, తల్లి విజయ ఇరువురు పిల్లలను కష్టపడి చదివించారు. ఈ క్రమంలో స్థానిక ఆదివాసీ యువతకు ప్రేరణగా నిలుస్తున్న లావణ్యకు భద్రాద్రి ఆదివాసీలు అభినందనలు తెలియజేస్తున్నారు.

24 గంటల్లో విధుల్లో చేరకుంటే క్రమశిక్షణ చర్యలు

(5వ పేజీ తరువాయి)

జాబితాలను కార్యాలయానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ఉత్తర్వులను ధిక్కరిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు. ఈ ఉత్తర్వులను దేవస్థానం ఉద్యోగుల వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు. ఈ హెచ్చరిక ఉత్తర్వులు దేవస్థానం ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారి తీస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ స్థలాల్లో.. పామాయిల్

(5వ పేజీ తరువాయి)

జాతీయ రహదారులతో పాటు కొత్తగా నాగపూర్-అమరావతి రాబోతోంది. విజయాడ-జగదల్‌పూర్ జాతీయరహదారి కూడా ఉంది. రహదారులు జిల్లాలో వందల కిలోమటర్లు దూరంలో ఉన్నాయి. అలాగే పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి రహదారులున్నాయి. వీటి వెంట ఖాళీస్థలాలున్నా నీడకోసం పలురకాల మొక్కలు వేస్తున్నారు. అయితే ఆయిల్‌పామ్ మొక్కల వేయడం ద్వారా రోడ్లవెంట పచ్చదనం, పర్యావరణంతోపాటు రహదారులు ఆకర్షణీయంగా ఉండే అవకాశం ఉంది. దీనికితోడు బ్రిడ్జిల అప్రోచ్‌లు, రోడ్ల అప్రోచ్‌లు కూడా కిందకు జరగకుండా ఈ చెట్లు రోడ్ల అప్రోచ్‌లు, చెరువుకట్టకు సపోర్టుగా నిలవనున్నాయి. జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్‌కాలేజీలు, హైస్కూళ్లతోపాటు ఇతర విద్యాసంస్థల్లో కూడా ఖాళీ ప్రదేశాలున్నాయి. ఈప్రదేశాలు అన్యాక్రాంతమవుతున్నందున ప్రహరీల పక్కతో పాటు నిరుపయోగంగా ఉన్న ప్రదేశాల్లోనూ ఆయిల్‌పామ్ మొక్కలు నాటడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో గ్రీనరీతో పాటు ఆయిల్‌పామ్ మొక్కలతో ఆదాయం లభించనుంది. అలాగే జిల్లాలో అటవీ భూములు కూడా వేలాది ఎకరాల్లో ఖాళీగా ఉన్నాయి. కొన్నిచోట్ల జామాయిల్ లాంటి మొక్కలు వేస్తున్నారు. ఈ మొక్కలు వేయడం వల్ల భూసారం దెబ్బతింటుందన్న ప్రచారం ఉంది. జామాయిల్‌కు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ మొక్కలు అటవీభూముల్లో వేయించి తద్వారా పచ్చదనంతోపాటు అటవీశాఖకు ఆదాయం కూడా రానుంది. అలాగే రెవెన్యూభూములు, ఇతర ప్రభుతవ శాఖల భూములు చాలా చోట్ల ఖాళీగా ఉన్నాయి. వీటిలో కూడా సరిహద్దుల్లో చుట్టూ అయిల్‌పామ్ మొక్కలు వేయనున్నారు.

బహుళ ప్రయోజనాలు..

జిల్లాలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఖాళీస్థలాలు నిరుపయోగంగా ఉన్న అటవీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ భూముల్లో ఆయిల్‌పామ్ మొక్కలు వేయడం వల్ల ప్రభుత్వ వనమహోత్సవ లక్ష్యంతోపాటు పచ్చదనం అభివృద్ధి చెందనుంది. ఈమొక్కలు ద్వారా ప్రభుత్వానికి ఆయా ప్రభుత్వ శాఖలకు ప్రతీ ఏటా ఆదాయం లభించనుంది. దీనికితోడు జిల్లాలో నూనెగింజల ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగనుంది. జిల్లాలో ఉన్న అధిక ఉష్ణోగ్రతను ఆయిల్‌పామ్ మొక్కలు పెద్దఎత్తున పెంచడం ద్వారా వేసవిలో కొంత చల్లదనం పెంపొందించే అవకాశం కలగనుంది. ఎకరానికి 57 మొక్కలు వరకు ఆయిల్‌పామ్ కింద సాగుచేస్తున్నారు. ఈ పంటకు ప్రభుత్వ పెద్దఎత్తున సబ్సిడీ అందిస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేసి ఈ మొక్కలను ప్రభుత్వ స్థలాల్లో నాటించడం ద్వారా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపెద్దఎత్తున జరగనుంది. ఉమ్మడిజిల్లాలో ఇప్పటికే లక్షా 20వేల ఎకరాల్లో సాగవుతోంది. మరో లక్ష ఎకరకాలపైగా ఆయిల్‌పామ్ సాగుచేయాలన్నది ఉద్యానశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. పెద్దఎత్తున జామాయిల్, సుబాబుల్ వంటి తోటలు సాగవుతున్నాయి. వీటికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌సాగును ప్రోత్సహించబోతున్నారు.

ఒక్కో మొక్కకు ఏటా రూ.2వేలనుంచి 5వేల ఆదాయం

ఆయిల్‌పామ్ మొక్క వేయడం ద్వారా ఉత్పత్తి మొదలయితే ఒక్కో మొక్క నుంచి రూ.2 వేల నుంచి రూ.5వేల వరకు ఆదాయం లభిస్తుందని, అంచనా. ప్రభుత్వస్థలాలు ఆయా శాఖల ఖాళీ భూముల్లో ఈ మొక్కలు వేయడం ద్వారా ప్రభుత్వ శాఖలకు కూడా ఆదాయం లభించనుంది. అటవీశాఖ వీఎస్ఎస్ కమిటీల్లా స్వయం సహాయక సంఘాలు, గ్రామాభివృద్ధి కమిటీలు, భూమిలేని వ్యవసాయకూలీల కమిటీలకు ప్రభుత్వ శాఖల పరిధిలో ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పచాయతీరాజ్ భూముల్లో ఆయిల్‌పామ్ మొక్కలు వేయించి వాటి సంరక్షణ, ఉత్పత్తి ద్వారా వారికికూడా అదనపు ఆదాయం సమకూర్చే అవకాశం ఉంది.

పర్యవేక్షణ మంచిదే... మరి ఆచరణ..!

12 పాఠశాలల బృందాల ఏర్పాటుకు సిద్ధం

ఇప్పటికే ఎంఈవోలు, హెడ్‌మాస్టర్స్, 161మంది పర్యవేక్షకులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ పాఠశాలలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల సరైన ఫలితాలు రావడంలేదని జవాబుదారితనం లేకపోవడంతో పర్యవేక్షణ కమిటీలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జిల్లాల్లో, మండలాల్లో మండల విద్యాశాఖాధికారులు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు పర్యవేక్షకులుగా ఉన్నారు. కొత్తగా విద్యాశాఖ పాఠశాలల పర్యవేక్షణ బృందాల ఏర్పాటు కోసం ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 1048 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 762 ప్రాథమిక, 162 ప్రాథమికోన్నత, 124 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 64,834 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో ఉండవలసిన ఉపాధ్యాయుల సంఖ్య కంటే అదనంగా 398 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, డిజిటల్ బోధన, ప్రయోగశాలలు, క్రీడా పరికరాలు, గ్రంథాలయాలు ఉన్నప్పటికీ విద్యార్థుల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంపై ప్రభుత్వ పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ప్రస్తుతం ఉన్న పర్యవేక్షకులు

జిల్లాలో 23మంది మండల విద్యాశాఖ అధికారులు 90కి పైగా స్కూల్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు ఆయా మండలాల పాఠశాలలను తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు తనిఖీ వివరాలు అప్‌డేట్ చేస్తున్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలతో పాటు, కాంప్లెక్స్ పాఠశాలలకు చెందిన నివేదికలు, సమావేశాలకు మాత్రమే పరిమితం అవుతున్నారనే విమర్శలు లేకపోలేదు.



విద్యార్థులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

నూతన కమిటీల ఏర్పాటు

జిల్లాలోని 1048 పాఠశాలలపై పర్యవేక్షణ కోసం 12 కమిటీలు ఏర్పాటు చేయబోతున్నారు. 100 పాఠశాలలకు ఒక 8 కమిటీలు, ప్రాథమికోన్నత పాఠశాలల కోసం రెండు కమిటీలు, ఉన్నత పాఠశాలల కోసం రెండు కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల కోసం ముగ్గురు ఉపాధ్యాయులతోను, ఉన్నత పాఠశాలల కమిటీలో తొమ్మిది మంది ఉపాధ్యాయులతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను కమిటీలకు నాయకత్వం వహించనున్నారు. ఈ కమిటీల ఎంపిక బాధ్యతలు జిల్లా కలెక్టర్ నేతృత్వంతో ఏర్పడిన జిల్లా కమిటీ ఎంపిక చేస్తుంది. ఎంపిక విధి విధానాలపై ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.

కమిటీలు ఏం చేయాలి ?

100 పాఠశాలలను మూడు నెలల్లో పర్యవేక్షణలు చేయాలనే బాధ్యత కమిటీకి అప్పగించారు. తాము పర్యవేక్షణ చేసిన వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి జిల్లా అధికారికి పంపించాల్సి ఉంటుంది. ముఖ్యంగా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేయడం, బోధన విధానాలు, విద్యార్థుల ప్రతిస్పందనలు పరిశీలించాల్సి ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో భాషా, గణితాల అభివృద్ధి, ఉన్నత పాఠశాలల్లో అభ్యసన నైపుణ్యాల పరిశీలన, కనీస అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడం, ప్రయోగశాలల వినియోగం, పఠనాభివృద్ధి, అభ్యసనా పెరుగుదల తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. కమిటీ సభ్యులు బోధనా అనుభవం, పరిశీలనా పరిజ్ఞానం, సబ్జెక్టులపై పట్టు, నూతన అంశాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే విద్యార్థులకు సరైన న్యాయం జరుగుతుంది. కమిటీల ఏర్పాట్లు, పర్యవేక్షణలో అలసత్వం వహిస్తే నామ మాత్రంగానే పర్యవేక్షణలు జరుగుతాయి.

తల్లిదండ్రులు ఏం కోరుకుంటున్నారు?

ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో కనీస అభ్యసనా సామర్థ్యాలు కలిగి ఉండాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రాథమికస్థాయి విద్యార్థుల్లో రాయడం, చదవడం, అవగాహన, ఆలోచనా సరళితో పాటు గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేసే విధంగా విద్యార్థులను తయారు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో చదివే పిల్లలకు, భాషా సామర్థ్యాలు క్రమశిక్షణ, గణిత సామర్థ్యాలు, సొంత మాటలతో రాయడం, పరిశీలన, పరిశోధన, నూతన ఆలోచనలు కలిగి ఉండాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

సకల సౌకర్యాలతో రూరల్ మండల కార్యాలయాలు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రణాళిక తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంరూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయ భవన నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం ఏదులాపురం మునిసిపాలిటీ ప్రాంతం తరుణి హట్ వద్ద నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమీకృత మండల కార్యాలయ సముదాయ భవనాల నిర్మాణ మ్యాప్‌లను పరిశీలించి ఆర్‌అండ్‌బీ అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఖమ్మం రూరల్ మండల స్థాయిలో ప్రజల సౌకర్యార్థం అన్ని కార్యాలయాలు ఒకేచోట అన్ని వసతులతో ఉండే విధంగా నిర్మించాలన్నారు.దీనికి తగిన విధంగా ప్రణాళికలు, భవనాలు, కావాల్సిన వసతుల నమూనా తయారు చేయాలని అన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, సబ్ రిజిస్ట్రార్, వ్యవసాయశాఖ మొదలగు అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండేలా సముదాయం ఉండే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. మండల కార్యాలయం నిర్మించిన తర్వాత నిర్వహణ కూడా సక్రమంగా జరిగేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. అంతర్గంగా 30ఫీట్లరోడ్డు, ఫైర్‌సేఫ్టీ సూచనలు పాటిస్తూ నిర్మాణాలు జరగాలన్నారు. మండల కార్యాలయ సముదాయానికి అవసరమైన విద్యుత్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు సమకూర్చుకునేలా ప్లాన్‌లో పొందుపర్చాలని అన్నారు. సమీకృత మండల కార్యాలయ సముదాయం వద్ద అవసరమైన పార్కింగ్ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా తాగునీటి సరఫరా కనెక్షన్ తీసుకోవాలన్నారు. ప్రతీఫ్లోర్‌లో ప్రజల వెయిటింగ్ ఏరియా ఉండాలని, అక్కడ తాగునీటి ట్యాప్ ఉండాలన్నారు. కార్యాలయాల్లో ఫైల్స్ పెట్టెందుకు స్టోరేజ్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ భగవాన్, ఏఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'అమ్మ'లను వదిలేశారు!

- రోడ్లపైనే అమ్మవారి విగ్రహాలు
- దేవీనవరాత్రులు ముగిసినా తీసుకెళ్లని వ్యాపారులు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం
- విగ్రహాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలంటున్న స్థానికులు



ఖానాపురం కరెంట్ ఆఫీస్ సమీపంలో దుర్గామాత విగ్రహాలు, బైపాస్‌రోడ్డులో..

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రుల సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విగ్రహాలను అమ్మకానికి తీసుకొచ్చిన వాటిలో కొన్ని అమ్మవారి విగ్రహాలు మిగిలిపోగా వాటిని విక్రయదారులు రోడ్లపైనే వదిలేశారు. దీంతో ఆవిగ్రహాలు దుమ్ముధూళితో నిండాయి. విగ్రహాలతో వ్యాపారం చేసుకున్న వ్యాపారులు మిగిలినవిగ్రహాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉండగా వారికేమి పట్టనట్లు రోడ్లపై వదిలేశారు. గతనెల22 నుంచి దేవి నవరాత్రులు ప్రారంభం కాగా ఖమ్మంలో సుమారు 300వందల విగ్రహాలను అమ్మకాలు జరిపారు. రోటరీనగర్, ఇందిరానగర్, ఇల్లెందురోడ్ గెస్టహౌస్, నాయుడుపేట చౌరస్తా, తదితర ప్రాంతాల్లో నేటికీ అమ్మవారి విగ్రహాలు రోడ్లపై దుమ్ము ధూళితో దర్శనమిస్తున్నాయి. బతుకుదెరువుకు రోడ్లపై కూరగాయలు, పండ్లుఅమ్ముకునే వారిపై వివిధరకాల పేర్లతో జరిమానాలు వేసే అధికారులు నేటికీ రోడ్లపై ఉన్న అమ్మవారి విగ్రహాల యజమానులపై చర్యలు తీసుకోలేదు. హిందూల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని,అమ్మవారి విగ్రహాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని హిందూవాదులు, స్థానికులు కోరుతున్నారు.

రూ.2 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం



ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటున్న రెవెన్యూ అధికారులు

ఖమ్మంరూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బారుగూడెం పరిధిలోని సర్వే నంబరు 26లో కొంతమంది ఆక్రమించుకున్న సుమారు 20 కుంటల ప్రభుత్వ భూమిని మంగళవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసే ప్రయత్నం చేస్తుండగా అధికారులు జేసీబీ సహాయంతో తొలగించారు. గతంలో ప్రభుత్వం అట్టి భూమిని అసైన్మెంట్ కింద కొంతమందికి అప్పగించారు. అందులో ఎటువంటి వ్యవసాయ పనులు చేయనందున, ఆ భూమిని ప్రభుత్వ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయినా కూడా ఆ భూమికి ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నించగా అధికారులు ఫెన్సింగ్ తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి విలువ మార్కెట్ రేట్ ప్రకారం సుమారు రూ.రెండు కోట్లు ఉంటుందన్నారు. ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పిల్లి. రాంప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సతీష్, ఆర్ఐ కేవీవీ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎంపికైన చిన్నారికి సత్కారం

అశ్వారావుపేటరూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): చెస్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన అశ్వారావుపేటకు చెందిన చిన్నారిని ఘనంగా సత్కరించారు. పేటకు చెందిన కేశిబోయిన భవ్యశ్రీ లక్ష్మీ అనే విద్యార్థిని నాలుగు రోజుల క్రితం హైదరాబాదులో జరిగిన చెస్‌పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైంది.

వైద్యపరీక్షల వివరాలు రోజూ బోర్డుపై ఉంచాలి

అదనపు కలెక్టర్ శ్రీజ



ఆరోగ్య మహిళా శిబిరం వద్ద మాట్లాడుతున్న శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): టీహబ్, సెంట్రల్ ల్యాబ్‌లో ఈరోజు అందుబాటులో పరీక్షలు ఇవీ అంటూ ప్రదర్శనకు పెట్టాలని తద్వారా ప్రజలకు వీటిపై అవగాహన ఉంటుందని జిల్లాఅదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. మంగళవారం ఆమె జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. తొలుత ఆమె మాతాశిశు సంరక్షణ కేంద్రానికి వెళ్లారు. అక్కడ లేబర్ రూం,ఎస్ఎన్‌సీయూల్యాబ్‌ను తనిఖీ చేశారు.టీహబ్, సెంట్రల్ ల్యాబుల్లో తరచుగా రక్తపరీక్షలు నిలిచిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయని వీటిపై సమీక్షించారు.ఈరోజు ఏమేమి పరీక్షలు అందుబాటులో ఉన్నాయనేది విధిగా ప్రదర్శన బోర్డు పెట్టి ప్రజలకు అవగాహన కలిగేలా చూడాలన్నారు. బాత్రూంల మరమ్మత్తు పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆరోగ్యమహిళ విభాగాన్ని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఆస్పత్రి వైద్యులు బాబూరత్నాకర్, డాక్టర్ ప్రేమలత, నందగిరి శ్రీను తదితరులున్నారు.

ఎట్టకేలకు రహదారికి మరమ్మతులు



ఖమ్మంఖానాపురంహవేలి,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): కార్పోరేషన్ ఒకటో డివిజన్ కైకొండాయిగుడెంతో పరిధిలోని పలుకాలనీల్లోఎట్టకేలకు రహదారులు నిర్మిస్తున్నారు. రోడ్లు, డ్రెయినేజీలులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో 'ఆంధ్రజ్యోతి' పలుకాలనీలును పరిశీలించింది.ఎవరిది నిర్లక్ష్యం, అనే కథనాన్ని ప్రచురించటంతో అధికారులు స్పందించారు. ఒవటో డివిజన్ పరిధిలోని రైల్వేకాలనీ, విద్యానగర్, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల వెనుక ప్రాంతాలలో సీసీరోడ్లను ప్రారంభించిన కాంట్రాక్టర్.. రైల్వేకాలనీలో మంగళవారం కంకర వేస్తున్నారు. మరో రెండు రోజులలో సీసీరోడ్డు వేయనున్నారు.విద్యా నగర్,తదితర ప్రాంతాలలో సీసీరోడ్లను ప్రారంభించారు. దీంతో స్థానికులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలుపారు. రోడ్డుతో పాటుగా డ్రెయినేజీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు మంత్రిని, అధికారులను కోరుతున్నారు.

విశ్వవిద్యాలయ అభివృద్ధి అందరి బాధ్యత

కేయూ ఉపకులపతి ప్రతాపరెడ్డి



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ప్రతాపరెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ అభివృద్ధి అందని బాధ్యతని కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా కళాశాలలో పలుగదులను పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, తరగతి గదులు విద్యార్థుల బోధన తీరు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినప్పుడే వారు భవిష్యత్తులో సమాజంలో రాణించి గుర్తింపు సాధిస్తారని, అగ్రగామిగా నిలుస్తామని అన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి చంద్రశేఖరరావు

ఖమ్మం లీగల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.వి చంద్రశేఖర రావు అన్నారు. మంగళవారం ఖమ్మం త్రివేణి టాలెంట్ స్కూల్‌లో అంతర్జాతీయ జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యాయాధికారి చంద్రశేఖరరావు హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఫోన్లకు ఆకర్షితులు కాకుండా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, మైనర్లు బైకులు నడిపి ప్రమాదాలకు గురికావద్దని, ర్యాగింగ్‌లకు దూరంగా ఉండాలని, రాబోయే పోటీపరీక్షలలో విద్యపై దృష్టి సారించి విజయం సాధించాలన్నారు. నిర్భయ చట్టం 2012 గురించి విద్యార్థులకు వివరించారు. నల్సాటోల్ ఫ్రీనెంబర్ 15100 ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని, ఎవరైనా ఆర్థిక సోమతలేని వారు ఉంటే వారికి ఉచితన్యాయం అందుబాటులో ఉంటు ందని తెలిపారు. ఉచిత న్యాయ సేవలకై డిస్ట్రిక్ లీగల్ సెల్ అథారిటీని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.రాజేంద్ర ప్రసాద్,వైస్‌ప్రిన్సిపాల్ ఎండిముస్తఫా, క్యాంపస్ ఇన్‌చార్జ్ జీవిచార్లెస్, న్యాయవాది హరి తదితరులు పాల్గొన్నారు

కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

తిరుమలాయపాలెం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం పోలీసుస్టేషన్‌లో సోమవారం జరిగిన ఘర్షణలో అంగోత్ వివేక్, గుగులోత్ నవీన్, భూక్యా శంకర్‌పై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సంజీవ్ తెలిపారు. ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్ బాలుపై వీరు దాడికి పాల్పడగా ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. ముగ్గురికి కౌన్సెలింగ్ ఇచ్చి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు. ప్రేమజంట వ్యవహారంలో ఈ ఘర్షణ జరిగింది.

హెడ్‌కానిస్టేబుల్ మదార్‌కు సేవాపతకం

ఖమ్మంలీగల్,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ కోర్ట్‌కానిస్టేబుల్ హెడ్ కినిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అలవాల మదార్‌కు కమిషనర్ ఆఫ్ పోలీస్ ఖమ్మం సునీల్ దత్ ఐపీఎస్ వారు సేవా పథకాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా రెండవ అదనప ప్రథమ శ్రేణి కోర్టు సూపరెంట్ రాజు మరియు కోర్టు సిబ్బంది న్యాయవాదులు అబినం దించారు

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ

రాష్ట్ర సెమినార్‌కు ప్రభాకర్ రెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు14 (ఆంధ్ర జ్యోతి):రాష్ట్రప్రభుత్వం,పాఠశాల విద్యాశాఖ, రాష్ట్రవిద్యాపరిశోధన, శిక్షణ మండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న విద్యార్థుల విద్యాపనితీరు, కెరీర్ ఎంపికలపై కౌన్సెలింగ్ ప్రభావం అనే అంశంపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్రసెమినార్‌కు పెసర ప్రభాకర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆయన రాసిన ఈరోజు నేర్చుకోండి-రేపు నాయకత్వం వహించండి అనే ఆర్టికల్ ఎంపిక అయిందని ప్రభాకర్ తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సెమినార్‌కు రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు,విద్యావేత్తలు,మేధావుల నుంచి మొత్తం 105 పరిశోధనలు విద్యాపరిశోధన శిక్షణ మండలికి అందాయి. వీటిల్లో 30 మందిని ఎంపిక చేశారు. ఈ ఎంపికలో తిరుమలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పెసర ప్రభాకర్‌రెడ్డి ఆర్టికల్ ఎంపికైందని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి డైరెక్టర్ రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. నేడు హైదరాబాద్‌లోని గోదావరి ఆడిటోరియంలో పేపర్స్‌ను విద్యావేత్తలు ,మేధావులు, అధికారుల ఎదుట ప్రజెంట్ చేయాలని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

పోలీసు అధికారులకు ప్రతిభా పురస్కారాలు



ఖమ్మంక్రైం,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవం, నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రప్రభుత్వం పలువురికి సేవా పతకాలు అందించింది. ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో పతకాలు సాధించిన వారిలో ఏడీసీపీ ప్రసాదరావు, టౌన్‌ఏసీపీ రమణమూర్తి, సీసీఆర్బీ ఏసీపీ సాంబరాజు, ఉన్నారు.ఈనేపథ్యంలో మంగళవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ సునిల్‌దత్ 82మంది పోలీసు సిబ్బందికి పతకాలు అందించారు. వారిని అభినందించారు.

మహిళ, శిశు సంక్షేమమే లక్ష్యంగా సేవలుండాలి

ఆర్జేడీ ఝాన్సీలక్ష్మిబాయి

కల్లూరు, అక్టోబరు14 (ఆంధ్ర జ్యోతి) మహిళా, శిశుసంక్షే మం, అభివృద్ధి లక్ష్యంగా అంగన్వాడీ టీచర్లు పనిచేయాలని వరంగల్ రీజియన్ ఆర్జేడీ ఝాన్సీలక్ష్మి బాయి అన్నారు. కల్లూరులో సెక్టార్ సూపర్‌వైజర్ సంధ్యా రాణి ఆధ్వర్యంలో కల్లూరు మున్సిపాలిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన పోషణ మాసోత్సవంలో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రంల్లో చిన్నారులకు ఆధునిక పద్ధతిలో విద్యను అందించేలా నూతన విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. గర్భిణీలు, బాలిం తలు, చిన్నారులకు షోషకాహార లోపం సమస్యలు లేకుండా సేవలు అందించాలన్నారు. ఆరోగ్యశాఖ సహకారంతో వ్యాధి నిరోధక టీకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షర్యాభ్యాసాలు చేశారు.జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి , స్థానిక వైద్యాధికారి వినీత్, కల్లూరు సీడీపీవో నిర్మల జ్యోతి, ఏసీడీపీవోలు రత్నమ్మ, నవ్యశ్రీ, సూపర్‌వైజర్లు సంధ్యా రాణి, భవాని, వెంకటమ్మ, మునిసిపాలిటీ మేనేజర్ ఎస్.నాగేశ్వర రావుతో పాటుగా గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

మాకు కొత్త బడి కావాలి

ఎడవల్లిలో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్థులు, తల్లిదండ్రులు

ముదిగొండ, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మాకు కొత్త బడి కావాలని ఉన్న బడిలో సమస్యలతో సతమతమవుతున్నామని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టిన సంఘటన ముదిగొండ మండలం ఎడవల్లిలో చోటు చేసుకుంది. జడ్పీఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో 230మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు లేవని వారు వాపోయారు. తరగతి గదుల్లో పాఠాలు జరిగే సమయంలో చీకటిగా ఉంటుందని, కరెంట్ లేని సమయంలో ఇబ్బందులు పడుతున్నామని దీంతో కళ్ల దెబ్బతింటున్నాయని విద్యార్థులు తెలిపారు. ఒకే ఆవరణంలో రెండు పాఠశాలలు ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఐదేళ్లక్రితం పాఠశాలకు నూతన భవనం మంజూరు కాగా దాని పనులు మధ్యలోనే ఆపి వేశారని ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు మౌళిక వసతులు కల్పించాలని కోరారు. ఎంఈవో రమణయ్య, ఎస్ఐ కృష్ణయ్య గ్రామస్థులు,తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రామయ్య



ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 66వేల మంది మున్సిపల్ కార్మికులు తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి పనిచేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని, మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం తక్షణం నెలకు రూ.26వేల వేతనం మంజూరు చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు మూడు కేటగిరిలో కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారని కేటగిరి 1లో రూ.15,600, కేటగిరి 2లో రూ.19,500, కేటగిరి 3లో రూ.22,750 ప్రభుత్వం చెల్లిస్తుందని వివరించారు. పెరిగిన నిత్యవసరాలను దృష్టిలో పెట్టుకొని వేతనం రూ.26వేలు చెల్లించాలని కోరారు. నాయకులు కొయ్యల శ్రీనివాస్,కిన్నెర నారాయణ, పార్దు యాదమ్మ, శ్రీనివాస్, వీరబాబు, నాగరాజు, యుగంధర్, రామమోహన్, దేవా, సరస్వతి, బాబు, నాగయ్య, వెంకన్న, కృష్ణ పాల్గొన్నారు.

శ్రీకోటమైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

కామేపల్లి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తలింగాల శ్రీకోటమైసమ్మతల్లి అమ్మవారి హుండీ లెక్కింపును దేవదాయ భద్రాచలం పరిశీలకుడు ఈ.వెంకటేశ్వర్లు, కార్యనిర్వహఅధికారి నల్లమోతు శేషయ్య సమక్షంలో నిర్వహించారు. 33 రోజులకు హుండీ ఆదాయం రూ.27874 వచ్చింది. అలాగే అమ్మవారి చీరలను బహిరంగ వేలం నిర్వహించగా జాస్తిపల్లికి చెందిన కొరివి వెంకటేశ్వర్లు రూ.13వేలకు పాట దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజారి పుల్లయ్యశర్మ, వరప్రసాద్ మల్లెంపాటి శ్రీనివాసరావు, తోటకూని సీతయ్య, కొరివి మోహన్ రావు,మంత్రాల పుల్లయ్య, కొత్తగట్టు శ్రీకాంత్,శ్రీను ఉన్నారు.

ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

సీపీఎం డివిజన్ కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న పార్టీ డివిజన్ కార్యదర్శి రమేష్

నేలకొండపల్లి, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి):ధాన్యం, పత్తి దిగుబడులు చేతికి అందుతున్న తరుణంలో వెంటనే ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నేలకొండపల్లి రావెళ్ల భవన్‌లో జరిగిన పార్టీ జనరల్ బాడీ సమాఏశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలను చెల్లించటంలో, ఇచ్చిన హామీలను అమలు చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతుల ధాన్యానికి బోనస్ చెల్లించటంలో సైతం విఫలమైందన్నారు. ఎడతెరిపి వర్షాల నేపథ్యంలో. రైతులను ఆదుకోవటానికి వెంటనే ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. సమావేశంలో షేక్.బషీరుద్దీన్, గుడవర్తి నాగేశ్వరరావు, కొప్పుల వెంకట్రామిరెడ్డి, భూక్యా కృష్ణ, ఏటుకూరి రామారావు, బెల్లం లక్ష్మీ, బలుసు ప్రమీల,దండా సైదారావు, సామాల మల్లికార్జునరావు, గాదె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ ఇన్‌చార్జ్ మహేంద్రను కలిసిన కాంగ్రెస్ నేతలు



మహేంద్రన్‌ను కలిసిన తిరుమలాయపాలెం నాయకులు

తిరుమలాయపాలెం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):జిల్లా డీసీసీ అధ్యక్ష పదవికోసం ఏఐసీసీ నియమించిన ఇన్‌చార్జ్ మహేంద్రన్‌ను మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నేతలు కలిశారు. డీసీసీ పదవికి తమను ఎంపిక చేయాలని కోరుతూ మందడి ఇజ్రాయేల్, బెల్లం శ్రీను, బొబ్బిలి భరత్‌చంద్రలు వినతిపత్రాలు అందించారు.

'సర్వజ్ఞ' విద్యార్థులకు పతకాలు



పతకాలతో పాఠశాల విద్యార్థులు

ఖమ్మంఖానాపురం హవేలి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు యోగాసన పోటీల్లో అద్భుతమైన ప్రదర్శనతో పతకాలు సాధించారని పాఠశాల చైర్మన్ నాగేంద్రకుమార్, డైరెక్టర్స్ నీలమ తెలిపారు. రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో అండర్-8 విభాగంలో స్వర్ణ, రజత పతకాలను సాధించారని తెలిపారు. ఆది యోగా పరమేశ్వరా యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 12న హైదరాబాద్‌లో ఈ పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు.

పౌష్టికాహారంపై అవగాహన



సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు

ఖమ్మంఖానాపురంహవేలి,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని రామన్నపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పోషణమాసంలో భాగంగా ఫుడ్‌స్టాల్ ఏర్పాటు చేశారు. పౌష్టికాహారంపై గర్భిణులు,బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి అర్బన్ సీడీపీవో వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ సత్యశీల హాజరయ్యారు. పలువురికి సీమంతాలు నిర్వహించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మౌనిక, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పత్తి అమ్మాలంటే కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేయించాల్సిందే

జిల్లా వ్యవసాయశాఖాధికారి పుల్లయ్య

కామేపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సీసీఐలో పత్తి విక్రయించాలంటే కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేయించాలని జిల్లావ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య సూచించారు. మంగళవారం మద్దులపల్లిలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు ముందుగా ఈయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, తమ ఫోన్ నెంబర్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం భూమి వివరాలు, ఆధార్‌కార్డు వివరాలు, పంటవివరాలు లాంటి సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. ఈవివరాల అనంతరం పత్తి విక్రయించే తేదిని ఎంపిక చేసుకొని స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. ఒకవేళ కౌలురైతు అయితే ఆవివరాలను కూడా యాప్‌లక్ష నమోదు చేసుకోవాలన్నారు. యాప్‌లో నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి వీలుంటుందన్నారు.





చర్చిని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని పాస్టర్ల ధర్నా

బోనకల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో ఈ నెల 10న చర్చిని ధ్వంసం చేయడంతో పాటు సిలువను బీటీసీలో వేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు వేముల సత్యం, తంపాల కృష్ణమోహన్, పాపగంటి రాజరత్నంలు మాట్లాడారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రమాదేవికి అందజేశారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు కొత్తపల్లి రాంబాబు, ఆనంద్‌బాబు, గద్దల ప్రవీణ్, ఏసురత్నం, రాజశేఖర్, ఎర్నెస్ట్ పాల్, భరత్, అబ్రహం, రాజు, రూబేన్ తదితరులున్నారు.

విద్యార్థినులు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

ఎర్రుపాలెం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా కిశోర బాలికలు, పౌష్టికాహారం తీసకుంటే రక్తహీనతను అధిగమించవచ్చని ఐసీడీఎస్ మధిర ప్రాజెక్టు అధికారి సునిత తెలిపారు మండలలోని రేమిడిచర్లలో జిల్లాపరిషత్ పాఠశలలో పోషణ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీల పరిదిలో కిశోర బాలికలకు పౌష్టికాహారం ప్రయోజనాలపై అవగాహన కలిపించారు. ఈసందర్భంగా కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. రాగులు సజ్జలు, కొర్రలు, అరికెలు, వరిగలు, సామల వంటి చిరుధాన్యాలతో అనేక ఆరోగ్యకమరైన ప్రయోజనాలున్నాయని తెలిపారు. వాటితో తయారుచేసిన పట్టీలను తీసుకుంటే రక్తహీనతకు చెక్‌పెట్టవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ ఎర్రుపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ సునిత, ఏఏఎం వైద్యురాలు డి.మౌనిక, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, రాధ, యోగేశ్వరి, ఆదిలక్ష్మి, వైద్యసిబ్బంది పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరెడ్డి,పుల్లమ్మ, ఆశావర్కర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సత్తుపల్లి: కౌమార దశలో ఆడపిల్లలు ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణి సూచించారు. మంగళవారం సత్తుపల్లి మండలంలోని తుంబూరులో ప్రభుత్వ పాఠశాలలో 60మంది విద్యార్థినీలకు శానిటరీ ప్యాడ్స్‌ను ఆమె ఉచితంగా అందజేశారు. ఆడపిల్లల్లో యుక్తవయస్సు వచ్చిన తర్వాత శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయని, ఆ మార్పులకు తగ్గట్టుగానే వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాల్సి ఉంటుందన్నారు. పురాతన పద్ధతుల్లో మాదిరిగా పాత వస్త్రాలను వాడితే లేనిపోని వ్యాధులు వస్తాయని, అటువంటి వాటికి బదులుగా శానిటరీ ప్యాడ్స్ వాడాలని కోరారు. తల్లిదండ్రులు కూడా కౌమార పిల్లలకు ప్యాడ్స్ అందుబాటులో ఉంచడంతో పాటు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు సొంత వైద్యం మానుకుని తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎర్రుపాలెంలో బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్‌ను అందిస్తున్న సుధారాణి

విద్యార్థులకు చేయూతనందించాలి



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న వీరభద్రం

ఏన్కూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు చేయూతనందించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. జన్నారం ప్రాథమిక పాఠశాలలో మంగళారం మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటుపుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యు డు తూము సుధాకర్, జన్నారం మాజీ ఉపసర్పంచ్ అడపా రామరావు, గార్లొడ్డు సొసైటీ ఉపాధ్యక్షుడు రేగళ్ల తిరుమలరావు, రైతుసంఘం మండల నాయకులు నేలపట్ల బాబు, పుచ్చకాయల వెంకన్న, సంపసాని వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం సాధం దివ్య తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పత్తి పైరును పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

తల్లాడ, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పంటలను మంగళవారం తెలంగాణ రైతుసంఘం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ మాట్లాడుతూ నష్టపోయిన పత్తి, వరి పంటలను వ్యవసాయశాఖ అధికారుల ద్వారా సర్వే చేయించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి, మడల కార్యదర్శి నల్లమోతు మోహన్‌రావు, నాయకులు గుంటుపల్లి వెంకటయ్య, అయినాల రామలింగేశ్వరరావు, సత్తెనపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాపురంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో కమల్‌రాజు

చింతకాని, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన పలు కుటుంబాలు మంగళవారం మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, మంకెన రమేష్, బండి రామారావు, గోగుల నరసింహరావు, వంకాయలపాటి లచ్చయ్య, గురిజాల హనుమంతరావు, గడ్డం శ్రీను, సామినేని అప్పారావు, పర్వగాని ఏడుకొండలు, షేక్ మదార్‌సాబ్, మీరా సాహెబ్, నాదెండ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డు పక్కన వాహనాలు నిలిపితే చర్యలు

చింతకాని, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారికి ఇరువైపుల భారీ వాహనాలను నిలపడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటుండటమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఎస్‌ఐ వీరేందర్ తెలిపారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామ సమీపంలో పెట్రోల్ బంక్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుకు పక్కన నిలిపిఉంచిన పలు లారీలకు ఎస్‌ఐ చలాన్లు విధించారు. నిబంధనలు అతిక్రమించి రోడ్డు ప్రక్కలకు వాహనాలు నిలిపరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజర్ బాక్స్ వితరణ

తల్లాడ, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పోలీసు హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో తల్లాడ మండలం మల్లవరం గ్రామపంచాయతీకి మృతదేహాన్ని భద్రపరిచే ఫీజర్ బాక్స్‌ను బహుకరించారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సిద్ధికి మియాకు పోలీసు హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు అందించారు. ఈకార్యక్రమంలో పోలీసు హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు ధనకొండ గోపాలరావు, ఉపేందర్, దుగ్గిదేవర ముత్యాలరావు, శివనాగబాబు, ఎర్రి అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర వాహనాల తనిఖీ



ఎమర్జెన్సీ వాహనాల తనిఖీలో దుర్గాప్రసాద్

వైరా, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా ఎమర్జెన్సీ సేవల అధికారి ఆవులూరి దుర్గాప్రసాద్ మంగళవారం వైరాలోని ఎమర్జెన్సీ వాహనాల పనితీరును తనిఖీ చేశారు. 108(ఎమర్జెన్సీ వాహనం), 1962(పశుసంచార వాహనం, 102(తల్లీ బిడ్డ అమ్మఒడి) వాహనాలను తనిఖీ చేసి రికార్డులను, మందుల నిర్వహణను పరిశీలించారు. ఎమర్జెన్సీ సమయంలో తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు. 108 సిబ్బంది నల్లమల వీరభద్రం, గొల్లమందల కృష్ణ, 1962 డాక్టర్ సౌమ్య, సిబ్బంది మురళీ, సతీష్, సలీం, 102 సిబ్బంది ఉగ్గం మహేష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ కార్యకర్త మృతి



నాని (ఫైల్)

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో బీఆర్‌ఎస్ కార్యకర్త మృతిచెందిన సంఘటన మంగళవారం సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. మునిసిపాలిటీలోని 6వ వార్డులోని రాజబాపయ్య వీధిలో నివాసం ఉంటున్న కోనేరు నాని (42) ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహకోల్పోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య , కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పలువురు రాజకీయ ప్రముఖులు సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలి: ఏడీఏ

ఏన్కూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): లైసెన్సు కలిగిన డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కొనుగలు చేయాలని వైరా ఏడీఏ కరుణశ్రీ తెలిపారు స్థానిక రైతువేదికలో మంగళవారం డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కంపెనీ అగ్రిమెంట్ తర్వాతనే మొక్కజొన్న సాగుచేయాలని రైతులకుసూచించారు. కిసాన్ కపాస్ యాప్ గురించి వివరించారు. డీలర్లు తప్పనిసరిగా స్టాక్, లైసెన్సు బోర్డులను ప్రదర్శించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏవో నరసింహారావు, ఏఈవో బాగ్యలహరి, డీలర్లు రాయల భద్రం, దేవిశెట్టి కృష్ణారావు, కొనకంచి రామకృష్ణ, పిన్ని వెంకట్‌నారాయణ, పాల్గొన్నారు.

'బెస్ట్ అవైలబుల్' బకాయిలను విడుదల చేయాలి

వైరా, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 30వేల మంది దళిత, గిరిజన విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపడిన బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం వైరాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 238 ప్రైవేట్ విద్యాసంస్థల్లో 30వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 20సంవత్సరాల నుంచి చదువుకుంటున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇది అమలులో ఉందని గుర్తు చేశారు. గత రెండు సంవత్సరాల నుంచి తెలంగాణ ప్రభుత్వం రూ.180కోట్ల బకాయిలను చెల్లించకపోవడంతో 30వేలమంది ఎస్సీ ఎస్టీ విద్యార్థులను పాఠశాలలోకి రాకుండా ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్డుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు బాణోతు హరిచంద్‌నాయక్, దరావత్ నర్సింహారావు, గుగులోతు రాజారామ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య సిబ్బందికి సన్మానం



వైద్యులను సన్మానిస్తున్న జగన్ కుటుంబ సభ్యులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అపస్మారక స్థితిలోకి చేరి ప్రాణాలకే ప్రమాదం అని అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో చేరిన రోగికి సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కొత్త జీవితాన్ని అందించారు. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన వేముల జగన్ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో తీవ్రమైన జ్వరంతో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరగా వైద్యులు సురేష్ నారాయణ పరీక్షించారు. అతడిని పరీక్షించిన వైద్యులు వైద్యం కోసం ఖమ్మం వెళ్లాలని సూచించడంతో అక్కడ ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో వారం రోజుల పాటు చికిత్స చేయించుకున్నప్పటికీ నయం కాలేదు. రూ.2లక్షలు ఖర్చయిందని, ప్రాణాపాయం తప్పదని అక్కడి వైద్యులు చెప్పడంతో స్వగ్రామం వచ్చినట్లు జగన్ భార్య కుమారి తెలిపింది. ఆ తరువాత సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి గతనెల 19న జగన్‌ను కుటుంబ సభ్యులు చేర్పించగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో డాక్టర్ సురేష్ నారాయణ, ఇతర వైద్యులు, సిబ్బంది సహాయంతో 26రోజుల పాటు నిత్యం పర్యవేక్షిస్తూ వచ్చారు. మల్టీ ఆర్గాన్ డ్యామేజీతో ఇక్కడి వచ్చిన జగన్‌కు వైద్యం అందించడంతో చాలా కష్టమైందని, కుటుంబ సభ్యుల అనుమతితో ముందుకు సాగానని వైద్యులు సురేష్ నారాయణ తెలిపారు. ఆ తర్వాత జగన్ ఆరోగ్య పరిస్థితి చేరినప్పటికీ ఇప్పటికీ మెరుగ్గా ఉందని టెస్టుల ద్వారా పరీక్షించి డిశ్చార్జీ చేశామన్నారు. తనను బతికించిన వైద్యులకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, పునర్జన్మ ఇచ్చినందుకు వారిని జగన్‌తో పాటు కుటుంబ సభ్యులు వైద్యులను ఘనంగా సన్మానించారు.

సేవా పతకాలు అందుకున్న కానిస్టేబుళ్లు

వైరా, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వైరా ఏసీపీ కార్యాలయంలో రైటర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్ షేక్.బాబ్‌జానీకి పోలీసు సేవ పతకాన్ని ఖమ్మం సీపీ సునీల్‌దత్ అందజేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు సేవా పతకాలు ఖమ్మం పోలీస్ కమి షనరేట్ పరిధిలో అత్యుత్తమ సేవలకుగానూ పలువురు పోలీసు సిబ్బందికి లభించాయి. మంగళవారం బాబ్‌జానీకి సీపీ సునీల్‌దత్ సేవ పతకంతోపాటు రూ.20వేల నగదును అందజేశారు. వైరా ఇన్‌చార్జ్ ఏసీపీ ఏ.రఘు, ఏసీపీ కార్యాలయ సీసీ నలమల అప్పారావు, ఏఎస్‌ఐ సీహెచ్.నాగేశ్వరరావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పెనుబల్లి: వీఎంబంజర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ బి.వెంకటేశ్వరరావు(బీవీ) 2023 సంవత్సరంలో రిసెప్షన్ డ్యూటీలో ఉత్తమ ప్రతిభను కనపర్చినందుకుగానూ ప్రభుత్వం ద్వారా భారత ప్రభుత్వం విశిష్ట సేవ పతకానికి ఎంపికయ్యారు. మంగళవారం ఖమ్మం కమిషనర్ సునీల్‌దత్ వెంకటేశ్వరరావుకు సేవా పతకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును సత్తుపల్లి రూరల్ ముత్తిలింగం, ఎస్‌ఐ కె.వెంకటేష్, సిబ్బంది అభినందించారు.

పరిహారం అందజేత

చింతకాని, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన అమరనేని వెంకటికి చెందిన పాడి గేదె ఇటీవల పొలంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. నష్టపోయిన రైతుకు విద్యుత్తుశాఖ పెద్దగోపతి ఏడీఏ తిలక్ రూ. 40 వేల చెక్కును మంగళవారం బాధిత రైతుకు అందజేశారు. కార్యక్రమంలో బొర్రా ప్రసాద్, తన్నీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ఏర్పాటుకు సన్నాహాలు

కల్లూరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): వానకాలం సీజన్‌లో ఉత్పత్తి అయిన ధాన్యం కొనుగోలుపై త్వరలో కేంద్రాలను ప్రారంభించాలని తహసీల్దార్ సాంబశివుడు కోరారు. కల్లూరులోని రైతువేదికలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మొత్తం 35 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, వ్యవసాయ అధికారి ఎం రూపా, ఐకేపీ ఏపీఎం అశోక రాణి, తదితరులు పాల్గొన్నారు.

నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన వ్యక్తి తన్నీరు

కల్లూరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన వ్యక్తి తన్నీరు లక్ష్మీనారాయణ అని సీపీఎం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్‌లు అన్నారు. కల్లూరులో మంగళవారం సీపీఎం కార్యాలయంలో సీనియర్ నాయకుడు తన్నీరు లక్ష్మీనారాయణ 16వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేయటమే కాకుండా నమ్మిన సిద్ధాంతం కోసం సీపీఎం పార్టీలో ఆయన చురుకైన పాత్ర వహించారని చెప్పారు. రైతుల కోసం, కార్మికుల హక్కుల కోసం పనిచేసిన లక్ష్మీనారాయణ ఆదర్శనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జాజిరి శ్రీనివాస్, సత్యనారాయ ణ, తన్నీరు కృష్ణార్జునరావు, తిరుపతరావు తదితరులు పాల్గొన్నారు.